సిద్ధరామయ్యపై
విచారణ జరపండి

- ముడా కేసులో సీఎంపై కేసు నమోదు చేయండి
- లోకాయుక్త పోలీసులకు ప్రత్యేక కోర్టు ఆదేశం

బెంగళూరు, సెప్టెంబర్ 25: ముడా భూముల కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరపాలని లోకాయుక్త పోలీసులను ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదు మేరకు సిద్ధరామయ్యపై విచారణ ప్రారంభించాలని పేర్కొన్నది. ఆయనపై సీఆర్పీసీ సెక్షన్ 156(3) కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. డిసెంబర్ 24 లోగా విచారణ నివేదికను కోర్టుకు అందజేయాలని పోలీసులకు సూచించింది. కాగా, ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యపై విచారణకు ఆగస్టు 16న గవర్నర్ అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ అనుమతిని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టేసింది. సిద్ధరామయ్యపై విచారణ జరపాచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి ముడా కేటాయించిన 14 స్థలాల్లో అవకతవకల ఆరోపణలపై లోకాయుక్త పోలీసులు విచారణ ప్రారంభించనున్నారు.

దేనికి భయపడ: సిద్ధరామయ్య

తనపై విచారణ జరపాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. తాను పోరాడతానని, దేనికీ భయపడనని పేర్కొన్నారు. విచారణను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, న్యాయపరంగానే తాను పోరాడతానని స్పష్టం చేశారు. కాగా, సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసిన స్నేహమయి కృష్ణ మాత్రం లోకాయుక్త పోలీసుల విచారణ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కేసును సీబీఐ ద్వారానే విచారణ జరిపించాలని, ఇందుకోసం తాము హైకోర్టునుఆశ్రయిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా, సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ, జేడీఎస్ డిమాండ్ చేశాయి. గురువారం విధానసౌధ ముం దు ఆందోళన చేపట్టాలని నిర్ణయించాయి.

ఆలయాల నిర్వహణ
గురువులకు అప్పగించాలి

- తిరుపతి లడ్డూ కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్

హైదరాబాద్: హిందూ దేవాలయాల నిర్వహణ బాధ్యతలను హిందూ ఆధ్యాత్మిక గురువులు, భక్తులకు అప్పగించాలని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవి శంకర్ అన్నారు. టీటీడీ లడ్డూ మహా ప్రసాదంలో కల్తీ జరిగినట్లు వార్తలు రావడంతో ప్రపంచవ్యాప్తంగా హిందువులు గుండె పగిలి తల్లడిల్లుతున్నారని ఆయన అన్నారు. ఈ సంఘటన 1857నాటి సిపాయిల తిరుగుబాటు జ్ఞాపకాలను తిరగదోడిందన్నారు. ప్రసాదం కల్తీకి బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, దేవాలయాల నిర్వహణ బాధ్యతలను హిందూ సాధువులు, ఆధ్యాత్మిక గురువులు, భక్తులకు అప్పగించాలని కోరారు. హిందూ దేవాలయాల నిర్వహణను పర్యవేక్షించడానికి, వాటి పవిత్రతను కాపాడటానికి ఉత్తర, దక్షిణ భారతావనికి చెందిన ఆధ్యాత్మిక వేత్తలు, గురువులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని, వివాదాలు తలెత్తినపుడు జోక్యం చేసుకునేందుకు ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఈ కమిటీలో ఉండవచ్చునని చెప్పారు. అయితే ప్రధాన నిర్ణయాలన్నింటినీ మతపరమైన బోర్డులు మాత్రమే తీసుకోవాలని తెలిపారు.

చెదిరిపోతున్న డాలర్ డ్రీమ్స్!

- అమెరికాలో కొలువుల కోతలు.. రోడ్లపై విద్యార్థులు
- రెండున్నర దశాబ్దాల్లో ఎన్నడూ చూడని సంక్షోభం
- ఏడాది వ్యవధిలో 98% పెరిగిన ఉద్యోగుల ఊస్టింగ్
- జాబ్స్ దొరక్కపోవడంతో భారత విద్యార్థుల అవస్థలు
- హోటల్స్, పెట్రోల్ బంకుల్లో తక్కువ జీతానికి విధులు

తెలంగాణకు చెందిన వెంకట్ ఆరేండ్ల కిందట ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. హెచ్1బీ వీసా రావడం, అమెరికాలో ఎమ్మెస్ పూర్తి చేయడంతో ఓ పెద్ద టెక్ కంపెనీలో అతనికి మంచి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అయితే, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఆ కంపెనీ అతన్ని ఏడాదిన్నర పూర్తి కాకుండానే తొలగించింది. ఎక్కడా ఉద్యోగం దొరక్కపోవడంతో న్యూజెర్సీలోని ఓ రెస్టారెంట్‌లో అతడు ఏడాది పాటు వెయిటర్‌గా పని చేయాల్సి వచ్చింది.

వరంగల్‌కు చెందిన అజయ్ హైదరాబాద్‌లోని ఓ దిగ్గజ కంపెనీలో ఐదేండ్లు పనిచేసి అమెరికా వెళ్లాడు. అక్కడే ఎమ్మెస్ పూర్తి చేశాడు. పని అనుభవం, ఉన్నత చదువు ఉన్నప్పటికీ ఇంకా అతనికి ఉద్యోగం రాలేదు. ఎన్ని కంపెనీలకు దరఖాస్తు చేసినా ఇంటర్వ్యూ పిలుపు రానే రావట్లేదు. హైదరాబాద్‌లో రూ.40 లక్షల ప్యాకేజీని కాదనుకొని అమెరికాకు వెళ్లిన మరో విద్యార్థికి ఇప్పటికీ అక్కడ ఉద్యోగం దొరకలేదు. దీంతో పెట్రోల్ బంకులో పని చేయాల్సి వచ్చింది.

భారతీయ విద్యార్థుల డాలర్ డ్రీమ్స్ కనుమరుగవుతున్నాయి. అమెరికా వెళ్లాలి.. చేతి నిండా డాలర్లు సంపాదించాలి. ఉన్నత స్థానానికి చేరుకోవాలి అనుకునే సగటు భారతీయుడి ఆశలపై అక్కడి తాజా పరిస్థితులు నీళ్లు చల్లుతున్నాయి.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): గడిచిన రెండున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా అమెరికా జాబ్ మార్కెట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఉపాధి కోసం అమెరికా వెళ్దామనుకునేవారి సంగతి అటుంచితే.. ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయో అని అమెరికాలోని భారతీయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగ భయం వారిని వెంటాడుతున్నది. దీంతో అక్కడే ఉండాలా.. స్వదేశానికి తిరిగి రావాలా అని ఆలోచనలో పడ్డారు.

భారీగా ఉద్యోగాల కోత..

పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మాంద్యం భయాలు, కంపెనీలకు వస్తున్న ప్రాజెక్టుల్లో క్షీణత, రానున్న అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ వెరసి అమెరికాలోని పలు కంపెనీలు తమ ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్తున్నాయి. అమెజాన్, మెటా, సేల్స్‌ఫోర్స్, ఎక్స్, ఉబర్ వంటి దిగ్గజ సంస్థలు సైతం ఉద్యోగాలకు కోత పెడుతున్నాయి. ఇలా జాబ్‌లు కోల్పోయిన వారిలో చాలామంది కొత్త ఉద్యోగాలు వెతుక్కోవడం కష్టంగా మారింది. లేఆఫ్‌లు మరింతగా పెరుగుతుండటంతో హెచ్1బీలకు సైతం ఉద్యోగాలు దొరక్కపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొవిడ్ అనంతర కాలంలో కూడా పారిశ్రామిక రంగం పెద్దగా పుంజుకోలేదు. దీనికితోడు అమెరికా ప్రభుత్వం ప్యాకేజీలను ఆపేసింది. లాక్‌డౌన్ సమయంలో వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు కాకపోవడంతో బ్యాంకులు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఫలితంగా కొత్త రుణాలివ్వడం నిలిపేశాయి.

ప్రపంచవ్యాప్తంగానూ..

ఒక్క అమెరికాలోనే కాదు జర్మనీ, స్వీడన్, యూకే, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లోనూ ఉద్యోగ సంక్షోభం ఉన్నదని లేఆఫ్-ఫై వెబ్‌సైట్ సహా మరో రెండు సంస్థల నివేదికలు వెల్లడించాయి. ప్రపంచంలోని ప్రతి పది ఉద్యోగ కోతల్లో మూడు ఉద్యోగాల ఊస్టింగ్ ఈ దేశాల్లోనే జరుగుతున్నట్టు వివరించాయి.

14 ఏండ్ల పని అనుభవమూ పనిచేయట్లే

అమెరికాలో 30 ఏండ్లుగా ఉంటున్నా. గడిచిన 28 ఏండ్లలో ఇలాంటి ఉద్యోగ సంక్షోభం ఎన్నడూ చూడలేదు. 14 ఏండ్ల పని అనుభవం ఉన్నవారికి కూడా ఇప్పుడు ఉద్యోగం దొరకట్లే. ఈ పరిస్థితి ఐటీలో మరింత ఎక్కువగా ఉన్నది.

– ఐతరాజు శ్రీకాంత్, అమెరికాలో ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు.

దీని ప్రభావం పారిశ్రామిక రంగంపై పడింది. వెరసి ఇది అగ్రరాజ్యంలో ఉద్యోగాల కోతకు దారి తీస్తున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.

చేసేదేమీ లేక..

అమెరికాలో ఉద్యోగాన్ని కోల్పోతే 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగాన్ని వెతుక్కోవాల్సి ఉంటుంది. లేదంటే దేశాన్ని వీడక తప్పదు. ఇక, అగ్రరాజ్యంలో ఎమ్మెస్ పూర్తి చేసిన వెంటనే సంబంధిత యూనివర్సిటీ విద్యార్థి పేరిట ఓపీటీ ఐ20 (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)ని విడుదల చేస్తుంది. దీని ద్వారా మూడు నెలల్లో ఏదో ఒక ఉద్యోగం చేయాలి. లేదంటే ఆ దేశాన్ని విడిచిపెట్టాలి. దీంతో దేశాన్ని వీడాల్సి వస్తుందన్న భయంతో కన్సల్టెన్సీల సాయంతో ఏదో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరినట్టు ధ్రువీకరణ పత్రాలు తీసుకొంటున్నారు. పొట్టకూటి కోసం తక్కువ జీతానికి రెస్టారెంట్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్నారు. ఉన్నత చదువుల కోసం తీసుకొన్న ఎడ్యుకేషన్ లోన్ ఎలా తీర్చాలని మరికొందరు భయపడుతున్నారు. తన తండ్రి సుమారు 40 లక్షలు అప్పు చేసి తనను అమెరికా పంపాడని, ఇప్పుడు చదువు పూర్తయినా ఉద్యోగం దొరక్క పార్ట్‌టైం జాబ్ చేస్తున్నానని, ఉద్యోగం దొరికే ఆశ కనుచూపు మేర కన్పించడం లేదని, ఏం చేయాలో అర్థం కావడం లేదని తెలంగాణ నుంచి యూఎస్ వెళ్లిన ఒక విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు.

'అమ్మో'రికానే

లే ఆఫ్-ఫై వెబ్‌సైట్ ప్రకారం నిరుడు ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగులు కోల్పోయిన మొత్తం ఉద్యోగాల్లో 70 శాతం వాటా అమెరికాదేనని తేలింది. ఎడ్‌టెక్, ఫుడ్, ఆర్థికం, రిటైల్, కన్స్యూమర్, ఆరోగ్య రక్షణ రంగాలకు చెందిన 7,21,677 మంది ఉద్యోగాలకు దూరమైనట్టు గణాంకాలు చెప్తున్నాయి. అమెరికాలో ఏడాది వ్యవధిలో ఉద్యోగాల తొలగింపులు 98 శాతం పెరిగాయని ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. అమెజాన్, మెటా వంటి టెక్ కంపెనీలే గత ఏడాది 1.68 లక్షల మందికి ఉద్వాసన పలికాయని పేర్కొన్నది. ఈ ఏడాది పరిస్థితులు మరింత అధ్వాన్నంగా ఉండనున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.

త్వరలో తగ్గనున్న పెట్రో ధరలు!

న్యూఢిల్లీ: పెట్రోలు, డీజిల్ ధరలు త్వరలో తగ్గవచ్చు! ఎన్డీయే కూటమికి అత్యంత కీలకమైన మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూలు వచ్చే నెలలోనే ప్రకటించే అవకాశం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో సీఎల్ఎస్ఏ అంచనా ప్రకారం, వచ్చే నెల 5 తర్వాత పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించే అవకాశం ఉంది. పెట్రోలియం, సహజ వాయువు శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ గత నెలలో ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు నిలకడగా కొనసాగితే ధరలను తగ్గించే అంశాన్ని ఆయిల్ కంపెనీలు పరిశీలించవచ్చునని ఆయన చెప్పారు.

బెంగళూరు హత్య కేసులో
అనుమానితుడి ఆత్మహత్య!

వివాహేతర సంబంధంపై అభ్యంతరం తెలిపింది ఇతనే

బెంగళూరు: అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిన మహాలక్ష్మి (29) హత్య కేసులో ప్రధాన అనుమానితుడు ముక్తి రంజన్ రాయ్ ఒడిశాలో మరణించాడు. విశ్వసనీయ వర్గాల వివరాల ప్రకారం.. బుధవారం భద్రక్ జిల్లాలో ఓ చెట్టుకు అతడు వేలాడుతూ కనిపించాడు. ఆయన ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. మహాలక్ష్మి ముఖ్య స్నేహితుల్లో ముక్తి ఒకడు. మహాలక్ష్మి వేరొక వ్యక్తితో సన్నిహితంగా ఉండటం పట్ల ముక్తి అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇటీవల మహాలక్ష్మిని విడిచిపెట్టిన ఆమె భర్త హేమంత్ దాస్‌ను ఉటంకిస్తూ వెలువడిన కథనాల ప్రకారం, ఉత్తరాఖండ్‌కు చెందిన అష్రఫ్ కొంతకాలం క్రితం మహాలక్ష్మితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె హత్యలో అష్రఫ్‌కు ప్రమేయం ఉందని దాస్ ఆరోపించారు. ముక్తి కోసం ఒడిశా-పశ్చిమ బెంగాల్ సరిహద్దులకు బెంగళూరు పోలీసు బృందాలు వెళ్లాయి. అయితే ముక్తి మరణించినట్లు ఒడిశా పోలీసులు వెల్లడించారు.

జమ్ము కశ్మీర్‌లో 56.05% ఓటింగ్

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. గందేర్‌బల్, శ్రీనగర్, బుద్గాం జిల్లాలతో పాటు జమ్ము ప్రాంతంలోని రియాసి, రాజౌరి, పూంచ్ జిల్లాల పరిధిలోని 26 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరగగా, సాయంత్రం 6 గంటల సమయానికి 56.05 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా రియాసి జిల్లాలో 71.81 శాతం ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా శ్రీనగర్ జిల్లాలో 27.31 శాతం మాత్రమే జరిగింది.

మిగతా రెండు తూటాలు
ఏమయ్యాయి?

బద్లాపూర్ ఎన్‌కౌంటర్‌పై బాంబే హైకోర్టు ప్రశ్న

ముంబై: పోలీసుల చేతిలో ఎన్‌కౌంటర్ అయిన బద్లాపూర్ లైంగిక దాడి నిందితుడు అక్షయ్ షిండే (24) మరణానికి దారి తీసిన పరిస్థితులపై బాంబే హైకోర్టు పలు ప్రశ్నలను సంధించింది. నిందితుడు పోలీసుల నుంచి తుపాకీ లాక్కుని మూడు రౌండ్లు కాల్పులు జరిపాడని పోలీసులు ఆరోపించారని, ఒక బుల్లెట్టే పోలీస్‌కు తగిలిందని, మిగిలిన రెండు తుపాకీ గుళ్లు ఏమయ్యాయని జస్టిస్‌లు రేవతి మోహితే దేరె, పృథ్వీరాజ్ చౌహాన్‌లతో కూడిన ధర్మాసనం ప్రాసిక్యూషన్‌ను ప్రశ్నించింది. పరిస్థితిని చక్కదిద్దడంతో పోలీస్ శాఖ విఫలమైందని, నిందితుడిని మోకాలి కింద కాల్చి ఉండాల్సిందని పేర్కొంది.

360 డిగ్రీల రక్షణతో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: సాయుధ బలగాలకు 360 డిగ్రీల రక్షణ కల్పించే తేలికపాటి బులెట్ ప్రూఫ్ జాకెట్లను డీఆర్‌డీఓ, ఐఐటీ ఢిల్లీ కలిసి అభివృద్ధి చేశాయి. అడ్వాన్స్‌డ్ బాలిస్టిక్స్ ఫర్ హై ఎనర్జీ డిఫీట్(ఏబీహెచ్ఈడీ) పేరుతో డీఆర్‌డీఓకు చెందిన ఇండస్ట్రీ అకాడమియా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, ఐఐటీ ఢిల్లీ ఈ జాకెట్లను తయారు చేశాయి. పాలిమర్లు, స్వదేశీ బోరన్ కార్బైడ్ సెరామిక్‌ను వీటికి ఉపయోగించారు. ఈ జాకెట్ బరువు 8.2 కిలోల నుంచి 9.5 కిలోల వరకు ఉంటుందని డీఆర్‌డీఓ తెలిపింది. వీటిని ధరించిన వారికి అన్ని వైపుల నుంచి రక్షణ ఉంటుందని పేర్కొన్నది.

15 గంటలు ప్రశ్నించడం
వీరత్వం కాదు

న్యాయమైన విచారణ విధానాన్ని పాటించాలి

ఈడీకి పంజాబ్-హర్యానా హైకోర్టు చురక

చండీగఢ్: ఒక కేసులో అనుమానితుడిని ఏకబిగిన 15 గంటల పాటు ప్రశ్నించడం వీరత్వం కాదని ఈడీపై పంజాబ్, హర్యానా హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇది మనిషి గౌరవానికి తీవ్ర వ్యతిరేకమని పేర్కొంది. నిందితులను అన్ని గంటల పాటు వేధించడం కన్నా వారిని ప్రశ్నించేందుకు సహేతుకమైన సమయాన్ని నిర్దేశించుకోవాలని, న్యాయమైన విచారణ విధానాన్ని అవలంబించాలని ఈడీ అధికారులకు సూచించింది. ఈ సందర్భంగా త్వరలో హర్యానా ఎన్నికలు జరగనున్న క్రమంలో ఈడీ అరెస్ట్ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పవార్‌ను విడిచిపెట్టాలని ఆదేశించింది. పన్వర్ అక్రమ మైనింగ్ కేసులో ఆయనను జూలై 19న ఈడీ ఏకబిగిన 14 గంటల 40 నిమిషాల పాటు ప్రశ్నించింది.

కమలా హారిస్ ప్రచార ఆఫీస్‌పై కాల్పులు

అరిజోనా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై కాల్పుల ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా అరిజోనాలో అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ఘటనపై ఆ కార్యాలయంలోని సిబ్బంది అందించిన సమాచారం మేరకు పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. దుండగులు కమలా హారిస్ ప్రచార కార్యాలయం కిటికీల వద్ద నుంచి కాల్పులు జరిపినట్టు తెలుస్తున్నదని, దీంతో ఆ కార్యాలయంలోని కిటికీలు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయని వివరించారు. కాల్పులు జరిగినప్పుడు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. కానీ, ఈ ఘటన వల్ల ఆ కార్యాలయ సిబ్బందితోపాటు ఆ చుట్టుపక్కల నివసిస్తున్నవారి భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ర్యాన్ కుక్ చెప్పారు.

దాడులు ఉగ్ర రూపం

- మొస్సాద్ ఆఫీసుపై హెజ్బొల్లా దాడి
- ఇజ్రాయెల్ దాడిలో 51 మంది మృతి
- హెజ్బొల్లాను తరిమి కొడతాం: ఐడీఎఫ్

బీరుట్: ఇజ్రాయెల్-హెజ్బొల్లా పరస్పర దాడులు బుధవారం మరింత ఉద్ధృతంగా మారాయి. హెజ్బొల్లా ఉగ్రవాదులు డజన్ల కొద్దీ రాకెట్లను ఇజ్రాయెల్ పైకి ప్రయోగించారు. టెల్ అవీవ్ సమీపంలోని ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయం పైకి బాలిస్టిక్ క్షిపణినిని ప్రయోగించామని హెజ్బొల్లా ప్రకటించింది. దీనిని అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. హెజ్బొల్లా ప్రయోగించిన వందలాది ప్రొజెక్టైల్స్ వల్ల ఇజ్రాయెల్‌లోని అనేక భవనాలు, ఇండ్లు ధ్వంసమైనట్లు, అనేక మంది ప్రజలు గాయపడినట్లు తెలుస్తున్నది. ఇజ్రాయెల్ బుధవారం జరిపిన దాడుల్లో 51 మంది మరణించారని, 223 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి తెలిపారు. తాత్కాలిక శిబిరాల్లో 27 వేల మందికి ఆశ్రయం కల్పించినట్లు లెబనాన్ అధికారులు చెప్పారు.

హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం మృతి

హెజ్బొల్లా రాకెట్-మిస్సైల్ విభాగాధిపతి కమాండర్ ఇబ్రహీం ఖబాయిసి ఇజ్రాయెల్ వైమానిక దాడిలో మరణించాడు. ఇబ్రహీంతోపాటు ఇద్దరు హెజ్బొల్లా హై ర్యాంక్ కమాండర్లు మరణించారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

నిర్వాసితులు 90 వేల మందికిపైనే

లెబనాన్‌పై ఇజ్రాయెల్ ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న దాడుల వల్ల 90 వేల మందికి పైగా ప్రజలు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఏడాదిలో సుమారు 2 లక్షల మంది నిర్వాసితులయ్యారని చెప్పింది.

ఇజ్రాయెల్ రిజర్వు దళాలు సమాయత్తం

హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థతో ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో రిజర్వు దళాలను సమాయత్తం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దీంతో లెబనాన్‌పై మరింత భీకరంగా ఇజ్రాయెల్ దాడి చేయబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.

వీటి ఖర్చులు భరించలేం..

చైనాకు పాండాలను తిరిగి ఇచ్చేస్తామన్న ఫిన్లాండ్

న్యూఢిల్లీ: చైనా నుంచి తీసుకొచ్చిన రెండు పాండాల నిర్వహణ ఖర్చు ఫిన్లాండ్‌కు తలనొప్పిగా మారింది. 2018లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఫిన్లాండ్ పర్యటన సందర్భంగా రెండు పాండాలను ఇక్కడి ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన 'జూ'కు అప్పగించారు. 15 ఏండ్ల పాటు పాండాలను ఈ జూలో ఉంచేందుకు చైనాతో ఫిన్లాండ్ ఒప్పందం చేసుకుంది. జూలో వాటి సంరక్షణ కోసం రూ.74 కోట్లు వెచ్చించింది. అయితే కోవిడ్ సంక్షోభం తర్వాత పర్యాటకుల తాకిడి తగ్గటంతో, జూపై ఆర్థిక భారం పెరిగింది. దీంతో పాండాల నిర్వహణ ఖర్చులు భరించలేమంటూ కంపెనీ చేతులెత్తేసింది. చైనాకు ఆ రెండు పాండాలను తిరిగి ఇచ్చేందుకు సిద్ధమైంది. మరికొద్ది రోజుల్లో పాండాలు చైనాకు చేరుకోనున్నాయి.

భూ భ్రమణంపై 'త్రీ గోర్జెస్' ప్రభావం

2 సెం.మీ పక్కకు ధ్రువాల స్థానం



బీజింగ్: చైనాలోని యాంగ్జీ నదిపై నిర్మించిన త్రీ గోర్జెస్ డ్యామ్ ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్. అయితే ఈ భారీ డ్యామ్ కారణంగా భూ పరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకండ్లు తగ్గిందని నాసా సైంటిస్టులు గుర్తించారు. అంతేకాదు ఈ భారీ డ్యామ్ వల్ల భూమి ధ్రువాల స్థానం కూడా రెండు సెంటీమీటర్ల మేర పక్కకు జరిగిందని సైంటిస్టులు చెబుతున్నారు. 'ఐఎఫ్ఎల్ సైన్స్' తాజా కథనం ప్రకారం, గుండ్రంగా తిరిగే వస్తువు ఏదైనా దానిలోని కణాలన్నీ సమానంగా పరుచుకుంటాయి. ఒక్కచోట ఏదైనా భారీ బరువు చేరితే..'ఇనెర్షియా'వల్ల సదరు వస్తువు తిరిగే వేగం తగ్గుతుంది. దీనినే 'మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా' అంటారు. త్రీగోర్జెస్ డ్యామ్‌తో భూమిపై ఇలాంటి ప్రభావమే పడి భ్రమణ వేగం తగ్గినట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఈ డ్యామ్‌లో నీటి నిల్వ కారణంగా 'మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా' ప్రభావం ఏర్పడుతుందని వెల్లడించారు.

ఎంబీఏలో హైదరాబాద్
ఐఎస్‌బీ సత్తా

- టాప్ 100 ప్రపంచ సంస్థల్లో స్థానం

మన దేశపు 3 ఐఐఎంలకూ చోటు

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అరుదైన ఘనతను సాధించింది. ప్రపంచంలో ఎంబీఏ కోర్సులు అందించే అత్యుత్తమ 100 సంస్థల్లో ఐఎస్‌బీకి స్థానం లభించింది. బుధవారం ప్రకటించిన క్యూఎస్ ర్యాంకింగ్స్ ప్రకారం దీనితో పాటు ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-అహ్మదాబాద్, ఐఐఎం-కలకత్తా కూడా టాప్ 100లో నిలిచాయి. ఈ మూడు ఐఐఎంలు ఉపాధి కల్పన విషయంలో టాప్ 50లో నిలిచాయి. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వరుసగా ఐదో ఏడాది అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. క్యూఎస్ గ్లోబల్ ఎంబీఏ, బిజినెస్ మాస్టర్స్ ర్యాంకింగ్ 2025 కింద 58 దేశాలకు చెందిన విద్యాసంస్థలు టాప్ 100లో నిలిచాయి. మనదేశం నుంచి ఈ నాలుగు సంస్థలను ఎంపిక చేశారు. ఈ ర్యాంకింగ్స్‌లో 2025కు భారత్‌లోని 14 ఫుల్‌టైమ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లను పరిగణనలోకి తీసుకున్నట్టు క్యూఎస్ సీఈవో జెస్సికా తెలిపారు.

జడ్జి మనసు, ఆత్మ నిష్పాక్షికంగా ఉండాలి

దేశంలో ఏ భాగాన్నీ 'పాకిస్థాన్' అని అనకూడదు

కర్ణాటక జడ్జి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మందలింపు

న్యూఢిల్లీ: న్యాయాన్ని నిర్ణయించి చెప్పేవారి హృదయం, ఆత్మ నిష్పాక్షికంగా, న్యాయంగా ఉండాలని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీషానంద ఇటీవల చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం స్వీయ విచారణ జరిపింది. జస్టిస్ శ్రీషానంద ఇటీవల ఓ మహిళా న్యాయవాదిని మందలించినట్లు, బెంగళూరులోని ముస్లిం మెజారిటీ ప్రాంతాన్ని పాకిస్థాన్ అని అభివర్ణించినట్లు వచ్చిన ఫిర్యాదుపై సుప్రీంకోర్టు స్పందించి, నివేదిక సమర్పించాలని కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. ఈ నివేదికపై బుధవారం ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి, కేసును ముగించింది. ఈ సందర్భంగా సీజేఐ చంద్రచూడ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలో పేర్కొన్న విలువలు మాత్రమే న్యాయ నిర్ణయానికి మార్గదర్శకం కావాలన్న విషయం ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి న్యాయమూర్తి తన సొంత వైఖరుల గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. న్యాయాన్ని నిర్ణయించి చెప్పేవారి హృదయం, ఆత్మ నిష్పాక్షికంగా, న్యాయంగా ఉండటం అవసరమని తెలిపారు. స్త్రీ ద్వేషంగా పరిగణించడానికి అవకాశం ఇచ్చే వ్యాఖ్యలు చేయరాదని కోర్టులను ఈ ధర్మాసనం హెచ్చరించింది. స్త్రీ లేదా పురుషుడు లేదా మరొక వర్గాన్ని ఉద్దేశించి ఎటువంటి వ్యాఖ్యలు చేయవద్దని చెప్పింది. భారత్‌లోని ఏ ప్రాంతానైనా 'పాకిస్థాన్' అని పిలవకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ శ్రీషానంద ఈ నెల 21న బహిరంగంగా క్షమాపణ చెప్పినందు వల్ల ఈ కేసు విచారణను ముగిస్తున్నట్లు చెప్పింది.

'యోగ నిద్ర' పని చేస్తున్నది

న్యూఢిల్లీ: యోగ నిద్ర చేస్తే మెదడులో అనేక సానుకూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇందులో ఎంత అనుభవం ఉంటే అంత మెరుగైన ఫలితాలు పొందొచ్చని ఓ అధ్యయనంలో తేలింది. ఐఐటీ ఢిల్లీ, ఎయిమ్స్ ఢిల్లీ, మహాజన్ ఇమేజింగ్‌కు చెందిన పరిశోధకులు కలిసి యోగ నిద్రపై అధ్యయనం జరిపారు. ఈ వివరాలు సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. యోగ నిద్ర చేస్తున్న వారి మెదడులో వస్తున్న మార్పులను ఎఫ్ఎంఆర్ఐ ద్వారా గుర్తించారు. యోగ నిద్రతో మెదడులో భావోద్వేగాలను, మనస్సు సంచారాన్ని నియంత్రించడం, జాగృతంగా ఉంటూనే లోతైన విశ్రాంతిలోకి వెళ్లడం వంటి మార్పులు వచ్చినట్టు పరిశోధకులు గమనించారు. యోగాలో అనుభవం లేని వారితో పోలిస్తే అనుభవం ఉన్న వారిలో ఈ మార్పులు ఎక్కువ ఉన్నట్టు తేల్చారు.

జేసీబీలే ప్రచార రథాలు

- హర్యానా ఎన్నికల్లో కొత్త ట్రెండ్
- వాటిపైనే క్రేజ్..ఓటర్లలోనూ ఆసక్తి
- అనూహ్యంగా పెరిగిన డిమాండ్

చండీగఢ్, సెప్టెంబర్ 25: ఎన్నికల వేళ హర్యానాలో జేసీబీలకు అనూహ్య డిమాండ్ ఏర్పడింది. వచ్చే నెలలో జరిగే ఎన్నికల ప్రచారానికి ఇంతవరకు కార్లు, వ్యాన్‌లు వంటి సంప్రదాయ వాహనాలు వాడిన రాజకీయ పార్టీలు ఇప్పుడు కొత్తగా జేసీబీలపై ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. వచ్చే నెల 5న జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఇప్పుడు వాటినే ప్రచార రథాలుగా వినియోగిస్తున్నారు. జేసీబీల ముందున్న బకెట్లలో నేతలు, కార్యకర్తలు జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ, పూలు జల్లుతూ, నృత్యాలు చేస్తూ కనిపిస్తున్నారు. ప్రజలు కూడా ఈ ప్రచారాన్ని చూడటానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో గురుగ్రామ్, ఫరీదాబాద్, నూహ్, మహేంద్రబాగ్ తదితర ప్రాంతాల్లోని రియాల్టీ సెక్టార్‌పై దీని ప్రభావం పడింది. ఇప్పటివరకు జేసీబీకి గంటకు రూ.1000 నుంచి 1500 వసూలు చేశామని, ఈ ఎన్నికల పుణ్యమా అని రాజకీయ పార్టీలు గంటకు రూ.5 వేలు చెల్లిస్తున్నాయని గురుగ్రామ్‌కు చెందిన జేసీబీ యజమాని ఒకరు తెలిపారు.

బుల్డోజర్ క్రేజ్.. నిలిచిన అభివృద్ధి పనులు

దేశమంతా ఇటీవల కాలంగా బుల్డోజర్ క్రేజ్ పెరిగింది. తొలుత యూపీలో మొదలైన ఈ బుల్డోజర్ సంస్కృతి ఇప్పుడు దేశంలోని పలు రాష్ర్టాలకు పాకింది. దీంతో బుల్డోజర్లకు ప్రతీకగా ఉండే జేసీబీల వెంట రాజకీయ నేతలు పడుతున్నారు. వాటిని చూడటానికి జనాలు ఎగబడుతున్నారు. బహిరంగ సభలు ముగిసిన తర్వాత అక్కడ పార్కు చేసి ఉన్న జేసీబీల వద్ద సెల్ఫీల కోసం జనం వేలం వెర్రిగా క్యూలు కడుతున్నారు.